క్లుప్తంగా

ఒత్తిడికి గురికావొద్దు



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శైలజ

గుమ్మఘట్ట: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఒత్తిడికి గురి కాకూడదని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ శైలజ సూచించారు. మండలంలోని బీటీపీ కేజీబీవీలో కణేకల్లు, బొమ్మనహాళ్, రాయదుర్గం, డి.హిరేహాళ్ మండలాల్లో పదోతరగతిలో ఫెయిల్ అయిన కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడారు. పరీక్షలు రాసే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఐదు మండలాల కేజీబీవీ ప్రిన్సిపాళ్లు షబానాబేగం, వెంకటలక్ష్మి, మంజుళ, శిల్ప, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కుల పరిరక్షణకు పాటుపడదాం

ఉరవకొండ (వజ్రకరూరు): బాలికల హక్కులు, పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి పిలుపునిచ్చారు. సోమవారం వజ్రకరూరులోని వెలుగు కార్యాలయంలో కిశోరి వికాసంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ మే 2 నుంచి 10 వరకూ జరిగే వివిధ కార్యక్రమాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. బాలికల సమిష్టి పరిచయం, విద్య కెరీర్ మార్గ దర్శకత్వం, నైపుణ్యాల ప్రాముఖ్యత, కౌమార బాలికల నాయకత్వ సాధికారికత, రుతుక్రమ పరిశుభ్రత, నిర్వహణ, లైంగిక విద్య పై అవగాహన కల్పించనట్లు తెలిపారు. అనంతరం కిశోరి వికాలం పోస్టర్లు విడుదల చేశారు.

10 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సమావేశమై చర్చిస్తున్న పట్టణ ప్రముఖులు

రాయదుర్గంటౌన్: పట్టణానికే తలమానికమైన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేద్దామని పట్టణ ప్రముఖులు, కుల సంఘాల నాయకులు, పెద్దలు తీర్మానించారు. మే 10 నుంచి 20 వరకు జరిగే కోటలోని శ్రీవారి బ్రహ్మోత్సవ వేడుకల నిర్వహణపై ఆలయంలో సోమవారం ఈఓ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాల సభ్యులు, పట్టణ ప్రముఖులు సమావేశమయ్యారు. ఉత్సవ ఏర్పాట్లు, కార్యక్రమాల నిర్వహణపై చర్చిస్తూ ప్రతి ఒక్కరి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. గౌని ఉపేంద్ర రెడ్డి, రాజేష్, చుంచుల నాగప్ప, టంకశాల హనుమంతు, వెంకటేశులు, అంబోజీరావు, రేకలకుంట సత్యనారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

మద్యం రవాణాపై దృష్టి పెట్టండి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

రాయదుర్గం: కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై పటిష్ట చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను ఏఈఎస్ శ్రీరామ్ తో కలసి సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. స్టేషన్‌లోని పెండింగ్ రికార్డులను పరిశీలించారు. వాటి పురోగతిపై స్థానిక ఎస్‌హెచ్‌ఓ (సీఐ) మహేష్‌కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీ మాట్లాడారు.. కర్ణాటక మద్యం అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పవన్‌కుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు హరియన్న, పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న అధికారులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం కార్యాలయానికి ప్రజలు ఎక్కువగా వస్తుంటారని, వేసవి కావడంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి

ఉరవకొండ: పట్టణంలోని ఎవీఆర్, మహేశ్వరి తదితర ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం స్కూళ్ల యాజమాన్యం ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక నాయకులు రాజశేఖర్, ఎంఎస్ఎఫ్ నాయకులు గణేష్, ఎంఆర్‌సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఫద్వీరాజ్ సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ముందస్తుగా పిల్లల బుక్స్‌తో పాటు ఫీజుల రూపంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నట్లు తెలిపారు.

గొంతు తడవదు.. చింత తీరదు!



- 22 రోజులుగా సమ్మెలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు
- 320 గ్రామాలకు సరఫరా కాని తాగునీరు
- తిప్పలు పడుతున్న ప్రజలు



దొడగట్టలో తాగునీటి కోసం పడిగాపులు కాస్తున్న స్థానికులు



వేతనాలు ఇవ్వకపోవడంతో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు (ఫైల్)

కళ్యాణదుర్గం: నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్య జఠిలంగా మారింది. ప్రభుత్వం పట్టించుకోలేదు.. ఈ ప్రాంత ప్రజలకు ఆధారమైన శ్రీరామరెడ్డి తాగునీటి పథకం అధికారులు, కాంట్రాక్టర్లకు ముందస్తు ప్రణాళిక లేదు. ఫలితంగా ప్రజలు వేసవిలో గుక్కెడు నీరు దొరక్క.. గొంతు తడవక తంటాలు పడుతున్నారు. రాత్రీ పగలు తేడాలేకుండా నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో సుమారు 320 గ్రామాలకు గత 17 రోజులుగా శ్రీరామరెడ్డి పథకం తాగునీరు సరఫరా ఆగిపోయింది. కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు గ్రామాలలో పంచాయతీ, సత్యసాయి పథకాల ద్వారా తాగునీరు అందుతోంది. మరికొన్ని గ్రామాల్లో సమీపంలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు.

కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నీటి కష్టాలిలా...

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని మారెంపల్లి, దేవీరమ్మ కాలనీ, వడ్డే కాలనీ, చాకలవీధి, ఐదుకల్లు రోడ్డు, ఇందిరమ్మ కాలనీ, ముదిగల్లు రోడ్డు తదితర శివారు కాలనీలకు తాగునీటి సరఫరా లేక ప్రజలు అల్లాడుతున్నారు. కుందుర్పి మండలంలో కుందుర్పి, కెంచంపల్లి, వడ్డేపాళ్యం గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. కుందుర్పిలో ట్యాంకర్ల ద్వారా సర్పంచు రామ్మూర్తి ప్రజల దాహార్తి తీర్చుతున్నారు.

బ్రహ్మసముద్రం మండలంలో సంతేకొండాపురం, పోలేపల్లి పంచాయితీలోని భైరవానితిప్ప, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. కళ్యాణదుర్గం మండలంలో ముద్దినాయనపల్లి, దురదకుంట గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది. శెట్టూరు మండలం చింతర్లపల్లి, బసంపల్లి, మాకొడికి గ్రామాల్లోనూ నీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు.

17 రోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులు:

శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు గత 17 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఫేజ్-1, ఫేజ్ -4 కు సంబంధించి సుమారు 280 మందికి వేతన బకాయిలతో పాటు పీఎఫ్ బకాయిలు ఉండటంతో కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఫేజ్ -4 కింద రాయదుర్గం నియోజకవర్గంలో 80 మంది, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 120 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఫేజ్-1లో పీఏబీఆర్ డ్యాంతో పాటు కూడేరు, మడకశిర ప్రాంతాల్లో సుమారు 80 మంది కార్మికులు పథకంలో పని చేస్తున్నారు. ఫేజ్-4లో పనిచేసే కార్మికులకు 2023 డిసెంబర్, 2024 జనవరి పూర్తి వేతనాలు ఇవ్వాల్సి ఉంది. అదే విధంగా 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు వేతనాలు అందలేదు. దీనికి తోడు 28 నెలల పీఎఫ్ బకాయిలు అందాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక కార్మికులకు వేతనాలు అందించడంలో అటు పాలకులు, పథకం కాంట్రాక్టర్లు విఫలయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తాగునీటి కోసం పరస్పరం దాడులు..

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని వడ్డే కాలనీలో గత ఐదు రోజుల క్రితం స్థానికులు తాగునీటి కోసం కత్తులతో పరస్పరం దాడులు చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ప్రకాష్, లక్ష్మి, గణేష్‌తో పాటు హనుమంత రాయుడు, వడ్డే సాంబ, వడ్డే పవన్‌లు ఒకరినొకరు నీటి కోసం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనపై ఇరు వర్గాలు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇదంతా శ్రీరామరెడ్డి తాగునీటి పథకం నీరు సరఫరా కాకపోవడం వల్లేనని స్థానికులు వాపోతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం

గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. వేసవిలో తాగునీటి సమస్య రానీయకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల సహకారంతో సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వర రావు, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం



వేతన బకాయిలు చెల్లించాలి

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలి. ఇప్పటికీ 17 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా పాలకులు, పథకం కాంట్రాక్టర్లకు ఏ మాత్రం బాధ్యత లేదు. కనీసం కార్మికుల కష్టాలను కూడా తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. నెలనెలా వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా గడుస్తాయి..? దీనిపై వెంటనే పాలకులు, అధికారులు చొరవ చూపాలి. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కరించాలి. – అచ్యుత్ ప్రసాద్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి



ప్రజా సమస్యలపై దృష్టి సారించండి



కౌన్సిల్ సమావేశంలో సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్లు గోవిందరాజులు, పద్మజ

రాయదుర్గంటౌన్: అధికారులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. సోమవారం పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత దాదాపు 25 అంశాలతో కూడిన అజెండా అంశాలను మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించారు. కొన్ని అంశాలపై కౌన్సిలర్లు గోవిందరాజులు, బండి అజయ్ సందేహాలు నివృత్తి చేసుకోగా, అజెండాలోని అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం జరిగిన జీరో అవర్‌లో సభ్యులు పలు ప్రజా సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. 28వ వార్డు కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు మాట్లాడుతూ ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని, కబ్జాకు గురై బళ్లారి రోడ్డులోని గంగమ్మబావి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, విద్య, వైద్యం, గృహ కల్పనలో రాయదుర్గం ప్రాంతంలోని పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకుంటున్న ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించేలా కౌన్సిల్ తీర్మానం చేసి కలెక్టర్ పంపించాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ పద్మజ మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో డ్రెయినేజీ సమస్య, నీటి సమస్య, వీధిదీపాల కొరత తీర్చాలని కోరారు. దుగ్గిలమ్మ గుడి వద్ద సీసీ రోడ్డు నిర్మించాలని 17వ వార్డు కౌన్సిలర్ సాబిరాబీ కోరారు. 8వ వార్డులోని కృష్ణాశ్రమం వెనుక వీధిలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని, నాగులకట్ట వద్ద ఉన్న బోరును మరమ్మతు చేయాలని కౌన్సిలర్ ముదిగల్లు చన్నవీర అధికారుల దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ బండి అజయ్ మాట్లాడుతూ పట్టణంలో వృథాగా ఉన్న హైమాస్ స్తంభాలను శివారు ప్రాంతాల్లో, హౌసింగ్ లేఅవుట్లలో ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ పైతోట సంజీవప్ప మాట్లాడుతూ పింఛన్ల కోసం అనేక అర్హులు ఎదురుచూస్తున్నారన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ గోవిందరాజులు అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ రవిప్రకాష్‌నాయుడు, టీపీఎస్ మోరళీ మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, ఏఈ ప్రతాప్, హౌసింగ్ ఏఈ చైతన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ పాల్గొన్నారు.

గాలీవానతో నేలకూలిన విద్యుత్ స్తంభాలు

గుమ్మఘట్ట: మండల వ్యా ప్తంగా ఉన్న గ్రామాల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షం అతలాకుతలం చేసింది. గాలీవాన బీభత్సానికి 38 విద్యుత్ స్తంభాలు నేలకూలగా, నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. గొల్లపల్లి, కేపీ దొడ్డి, గోనబావి గ్రామాలకు విద్యుత్ సరాఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విష పురుగుల బెడద నుంచి రక్షించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. ఉద్యానవన పంటలైన అరటి, దానిమ్మ, మామిడి, బొప్పాయిని సాగు చేసిన అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. గొల్లపల్లి గ్రామంలో తిమ్మారెడ్డి సాగు చేసిన దానిమ్మ పంట వర్షం దెబ్బకు పండ్లు నేలరాలినట్లు బాధితులు తెలిపారు.

రాయదుర్గంలో 38.6 ఎంఎం వర్షపాతం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణం, రూరల్ పరిధిలో ఆదివారం సాయంత్రం దాదాపు 45 నిమిషాలపాటు కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో 38.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షంతో పట్టణంలోని లోతట్టు కాలనీలు జలమయమై ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. గుమ్మఘట్ట మండలంలో 4.8 మిల్లీమీటర్లు, కణేకల్లులో 1.4 మిల్లీమీటర్ల వేర మోస్తరు వర్షం పడింది.

ఆర్డీటీపై ఆంక్షలు విధిస్తే ఊరుకోం



రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఆర్డీటీపై ఆంక్షలు విధిస్తే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని అంబేద్కర్ సేన జిల్లా యువజన నాయకుడు కె.సి. పవన్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి, పేదరిక నిర్మూలన కోసం ఆర్డీటీ సేవ చేస్తోందన్నారు. విదేశాల నుంచి ఆర్డీటీకి నిధులు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఎఫ్‌సీఆర్ఏ కింద వివిధ దేశాల నుంచి ఆర్డీటీకి అందుతున్న సహాయాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, ఉమేష్, సురేష్, రాజేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీటీ సేవలను అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని మండలంలోని వివిధ వర్గాల పేదలు, ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. సోమవారం స్థానిక రామస్వామి ఆలయం నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ నాగరాజు, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, ఫెర్రర్ ఆలయ కమిటీ అధ్యక్షులు ఓబయ్య, ఎలక్ట్రీషియన్ నాగేంద్ర, సర్పంచులు అతావుల్లా, మాజీ సర్పంచులు లింగప్ప, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కంబదూరులో 'సేవ్ ఆర్డీటీ...సేవ్ అనంత' నిరసన

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక తహసీల్దార్‌కార్యాలయం వద్ద 'సేవ్ ఆర్డీటీ.. సేవ్ అనంత' నినాదంతో సోమవారం నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ బాలకిషన్‌కు సంతకాలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల పట్టణ కన్వీనర్ వడ్డే వెంకటప్ప, రూరల్ కన్వీనర్ హనుమంతురాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడు, జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడు బొమ్మయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నీలి శంకరప్ప, మండల బూత్ కమిటీ కన్వీనర్ రాళ్ల అనంతపురం భీమేష్, కోఆప్షన్ మెంబర్ ఫయాజ్, శ్రీమల్లేశ్వర ఆలయ ధర్మకర్త మల్లూరు వెంకటేశులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని ములకలేడులో సోమవారం 'సేవ్ ఆర్డీటీ' అంటూ నినాదాలు చేశారు. అనంతరం బస్టాండ్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, సురేష్, వేదవేస్, చిరంజీవి, మహేష్, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష



రాయదుర్గంలో రిలే నిరాహార దీక్షలో కూర్చున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు



ఉరవకొండ ఆర్టీసీ డిపో ఎదుట సమస్యల పరిష్కారం కోసం రిలే దీక్షలు చేపట్టిన ఎన్ఎంయూ నాయకులు

రాయదుర్గంటౌన్: న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు రిలే నిరహార దీక్ష చేయనున్నారు. తొలి రోజు సోమవారం డిపో వద్ద 10 మంది ఉద్యో గులు రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. యూనియన్ రాష్ట్ర అసిస్టెంట్ కార్యదర్శి నాగరాజు, జోనల్ ఉపాధ్యక్షుడు ఎంఎండీ షఫీ హాజరై దీక్షలు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ నెల 2,3 తేదీల్లో ఎర్రబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపామని, 10, 11 తేదీల్లో గేట్ ధర్నాలు చేసి 17న ప్లకార్డులతో నిరసనతో సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో రెండు రోజుల పాటు రిలే దీక్షలకు పూనుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి తిప్పేస్వామి, రవినాయక్, సిద్దేశ్, టీఎస్‌కే జిలాన్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలు చేయాలి

ఉరవకొండ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నేషన్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉరవకొండ డిపో ఎదుట రిలే దీక్షలను సోమవారం ప్రారంభించారు. డిపో కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇచ్చి, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం, సంస్థ ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలు ప్రకటించాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలి. ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈఓఎల్ మంజూరు చేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగ దంపతులకు లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. మొదటి రోజు రిలే దీక్షల్లో బాలకృష్ణ, వలి కూర్చు న్నారు. ఎన్ఎంయూ నాయకులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలని వాగ్వాదం

కూడేరు: ఉపాధి పనులు కల్పించలేదని కడదరకుంటకు చెందిన కూలీలు అధికారులతో సోమవారం వాగ్వాదానికి దిగారు. కొద్ది రోజులుగా పనులు కల్పించాలని కోరుతున్నా సిబ్బంది పట్టించుకోకపోతే ఎలా? అని ఏపీఓ పోలేరయ్యను ప్రశ్నించారు. పనులు కల్పించకపోవడంతో గ్రామంలో చాలా మంది కూలీలు ఉరవకొండ మండలంలో బ్యాడిగి మిర్చి తొలగించేందుకు వెళ్తున్నారన్నారు. తప్పకుండా పనులు కల్పిస్తామని ఏపీఓ హామీ ఇవ్వడంతో కూలీలు వెనుదిరిగారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి



ఉరవకొండ: సరస్వతీ దేవి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న విద్యార్థులు



బొమ్మనహాళ్‌లో మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ దాస్

ఉరవకొండ: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి వై.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయశాఖలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. గ్రంథాలయాధికారి ఆధ్వర్యంలో సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాల వేసి, పూజలు చేశారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ ఈశిక్షణ తరగతులు మే 28 వరకు కొనసాగుతాయన్నారు.

గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు ప్రారంభం

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూర్ గ్రంథాలయ శాఖలో సమ్మర్ క్యాంపులు సోమవారం సర్పంచ్ మోనాలీసా ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి మునెమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడారు. మేజర్ పంచాయతీ ఈఓ మల్లయ్య, సామాజిక వేత్త బెంజిమెన్, జేవీవీ కార్యదర్శి మల్లికార్జున, వలి పాల్గొన్నారు.

కూడేరు: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని గ్రంథాలయాధికారిణి రాధా రాణి పిల్లలకు తెలియజేశారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్యారంబోర్డు, చెస్, ఇతర ఆటలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది, పాఠకులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మానసిక ప్రశాంతత

బొమ్మనహాళ్: పుస్తక పఠనంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఈఓపీఆర్‌డీ దాస్, గ్రంథాలయ అధికారి బాబుప్రసాద్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాలలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని 62 మంది చిన్నారులతో కలిసి వారు ప్రారంభించారు. టీచర్ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: కణేకల్లు లైబ్రరీలో సమ్మర్ క్యాంపును గ్రంథాలయాధికారి టీ.వన్నూరుస్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటైన సమావేశంలో గ్రంథాలయాధికారి మాట్లాడారు. వేసవి సెలవుల దృష్ట్యా విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, స్టోరీ బుక్స్‌తో పాటు నవలలు, జీకే బుక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. చెస్ గేమ్‌తోపాటు డ్రాయింగ్స్ కూడా రోజు నిర్వహిస్తామన్నారు.

అశ్వవాహనంపై శ్రీవారు



అశ్వవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వేంకటరమణ స్వామి అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయం భక్తులతో గోవిందనామ స్మరణతో మార్మోగింది. అనంతరం సతీసమేతంగా శ్రీనివాసుడిని అశ్వవాహనంపై కూర్చోబెట్టి ఆలయం నుంచి ప్రధాన ర హదారిపై గోవింద..గోవిందా అంటూ భక్తులు ఊరేగించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు



సీతారాముల విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: సొల్లాపురంలో నూతన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా తొలిరోజు సోమవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గంగపూజ, గోపూజ చేసి యాగశాల ప్రవేశం చేశారు. సాయంత్రం సీతారాములు, ఆంజనేయస్వామి విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. మంగళవారం హోమాలు, పూజలు ఉంటాయని ఆలయ కమిటీ తెలిపింది.

అవినీతిపై విచారణ చేపట్టాలి



కళ్యాణదుర్గం: ధర్నా చేస్తున్న దళిత నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో అంబేడ్కర్ సర్కిల్లో ధర్నా చేశారు. అనంతరం ఆర్‌డీఓ వంసత్ బాబుకు వినతి పత్ర అందజేశారు. దళిత నాయకులు మాట్లాడుతూ కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ డబ్బులు ఇవ్వకపోతే అన్ని అర్హతలున్నా ఏదో సాకు చెప్పి రిజిస్ట్రేషన్ చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారన్నారు.పేదల ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే రూ.10 వేల నుంచి రూ.20 వేలు డిమాండ్ చేస్తున్నారన్నారు. సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి గోపాల్, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిప్పేనాయక్, దళిత జన జాగృత ఆర్కేరాజు, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు చెలిమప్ప, బైభీమ్ విలియమ్స్ పాల్గొన్నారు.

ఆపదలో రక్త దానం చేసిన ఉరవకొండ వాసి



ఏబీ నెగిటివ్ రక్తం ఇస్తున్న దాత ఎర్రిస్వామి

ఉరవకొండ: అనంతపురానికి చెందిన ఓ మహిళ కేన్సర్‌తో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు .. వెంటనే రక్తం ఎక్కించాలని సూచించారు. అయితే మహిళకు అరుదైన ఏబీ నెగిటివ్ రక్తం అవసరం కావడంతో కుటుంబ సభ్యులు ఎన్నో ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఉరవకొండ లయన్స్ క్లబ్ సభ్యులు జమీల్, నూర్‌లు ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులకు తెలపగా పట్టణానికి చెందిన రక్తదాత ఎర్రిస్వామిని పంపారు.

30లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలో ఈనెల 30లోపు కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ నయాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. మండలంలో మొత్తం 47,688 మంది రేషన్‌కార్డుదారులున్నారని, ఇప్పటిదాకా 42,611 మంది ఈకేవైసీ చేయించుకున్నట్లు తెలిపారు. మరో 3,838 మంది కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండల ప్రజలు అధికారులకు వినతులు ఇచ్చారు. ఎక్కువగా భూ సమస్యలు పరిష్కారం కోసం అర్జీలు వచ్చాయి. డీటీ సూర్య ప్రతాప్ వాటిని స్వీకరించారు. ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, హౌసింగ్ డీఈ హనుమప్ప, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగ దివ్య, ఏపీఎం దేవానంద ఫిలిప్పన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాఠశాలలో కలిసిన వినయశ్రీ విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శ్రీవినయశ్రీ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 2005–06 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు స్నేహితులు, ఉపాధ్యాయులతో జ్ఞాపకాలను పంచుకున్నారు. గురువులు, పాఠశాల కరస్పాండెంట్ మీనాకుమారి, నాగరాజు దంపతులను సత్కరించారు. ఉపాధ్యాయులు జనార్ధన్, ఎర్రిస్వామి, తిప్పేస్వామి, గౌరీ శంకర్, వీరభద్ర, కిశోర్‌కుమార్, వందన, చంద్రవదన, నిర్మల, కళావతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.